# ప్రేక్షకుడు

**ఇతరుల బలహీనతల్ని సొమ్ము చేసుకుని బతకడమే మనిషి నైజమా? ఈ మాయామేయ జగత్తులో మాయే సత్యమా?**

మానవ జీవితమే ఒక మహేంద్రజాలం. నిరంతరం సుఖ దుఃఖ వలయాల చుట్టూ పరిభ్రమించే మనిషి నవరసాల సంకలితమైన జీవితంలో వివిధ పార్శ్వాల్లో విపరీతానుభవాలు ఎదురైనప్పుడు, 'అంతా మాయ... ఇదంతా మాయామేయ జగంబు' అని అనుకోవడం సహజం. కానీ, విశాల జీవనపథంలో మానవ మాయాజాలాన్ని చూస్తున్నప్పుడు కొంత ఆశ్చర్యం కలుగుతుంది. మరి కొంత గగుర్పాటు కలుగుతుంది. విషాద, వినోదాల నడుమ 'మానవత్వపు అస్తిత్వం' ప్రశ్నగా మారుతుంది. అలాంటి ప్రశ్నకు జవాబు ఏమిటి?

* * *

దూరంగా కృష్ణానది. పాయలు పాయలుగా విడిపోతున్న అలలు. ఆ అలల్ని పెనవేసుకుంటున్న అస్తమిస్తున్న సూర్యుని రేకలు రకరకాల రంగుల కుంచెలతో ఆధునిక చిత్రకారుడు గీసిన అత్యాధునిక వర్ణసమాహారంలా ఉన్నాయి.

నదికి ఒక పక్కన వజ్రాల కొండ. ఆ వజ్రాల కొండ దిగువన లోయ పక్కన ఉస్తేపల్లి అనే కుగ్రామం. ఆ చివరన ఎర్రమట్టి రంగులో ఇంకో కొండ. రెండు కొండల మధ్య అటు కృష్ణ, ఇటు గుంటూరు జిల్లాల మధ్య నీటి వారధిలా ఉంది కృష్ణానది. ఆ నదికి ఈ ఒడ్డున, ఆ ఒడ్డున లంగరు వేసిన నాటు పడవలు. ఆ పడవల్ని నడిపే పల్లెకారులు ఇసక దిబ్బల మీద కూర్చుని కబుర్లాడుకుంటున్నారు.

ఎగుడుదిగుళ్ళ దారి మలుపుల్లో ఆపసోపాలు పడుతూ కొండకు ఎడమవేపునున్న ఉస్తేపల్లి, పంపింగ్ రిజర్వాయర్ ప్రాజెక్ట్ బిల్డింగ్ దగ్గర జీపు ఆగింది.

ప్రభుత్వం ఆమోదించిన పథకం మేరకు జిల్లాలో వివిధ మండల కేంద్రాల్లో ఎత్తిపోతల పథకాల పనులు జోరుగా జరుగుతున్నాయి. ఆ పనుల తనిఖీ నిమిత్తం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హోదాలో హైదరాబాద్ నుంచి నేనొచ్చాను.

నందిగామ నుంచి ఉదయాన్నే బయలుదేరి కొన్ని పథకాలను చూసి, మధ్యాహ్నం కంచికచెర్లలో లంచ్ చేసి, రెండో విడత తనిఖీలో భాగంగా ఇక్కడకొచ్చాను. సంబంధిత స్థానిక ఇంజనీర్లు, అధికారులు పరుగు పరుగున జీపు దగ్గరకొచ్చి, గౌరవంగా నమస్కరించి ఆహ్వానించారు.

ఆ కృష్ణానది మీంచి వచ్చిన చల్లగాలి ఒక్కసారి ఒంటికి తగిలేసరికి రోజంతా ఎండలో చేసిన ప్రయాణపు అలసట ఎగిరిపోయింది.

ఈ ప్రాంతానికి రావడం ఇదే మొదటిసారి. దూరంగా అటువేపు అమరావతిలోని అమరేశ్వర దేవాలయం గోపురమ్మీద పడుతున్న లేత ఎండ మెరుపులు, ఇసక దిబ్బల మీద పడి రేణువుల్లో ప్రాణ స్పందనను కలిగిస్తున్నాయి.

అధికారులతోపాటు రిజర్వాయర్ బిల్డింగ్‌లోకి నడిచాను. సంబంధిత ఇంజనీర్లు ఫైల్స్‌ను నాకందించి, ఏయే పనులు పూర్తయ్యాయో ఇంకే పనులు ఎన్ని రోజులకు పూర్తవుతాయో చెప్తున్నారు.

అరగంట గడిచింది. బిల్డింగ్‌లోంచి బయటకొచ్చాం.

తెల్లటి పావురాలు వరుసగా ముందుకు కదులుతున్నట్లు మెల్లగా వెలుతురు మాయమైపోతోంది. మబ్బులు మందగామినుల్లా కొండమీదకు దిగుతున్నాయి.

"వండ్రఫుల్ ప్లేస్" అన్నాన్నేను పక్కనున్న అసిస్టెంట్ ఇంజనీరుతో.

"అందుకే సార్ ఇవాళ రాత్రి ఆ కొండమీద గెస్ట్‌హౌస్‌లో మీ బస ఏర్పాటు చేశాం" అన్నాడతను దూరంగా ఉన్న పాతకాలపు బిల్డింగ్‌ను చేత్తో చూపిస్తూ.

పది నిమిషాల తర్వాత గెస్ట్‌హౌస్‌లోకి అడుగు పెట్టాను. గెస్ట్‌హౌస్ వాచ్‌మెన్ యోహాన్ ఎదురుగా వచ్చి, తనని తాను పరిచయం చేసుకున్నాడు.

"సర్. మాలో ఎవర్నయినా మీకు కంపెనీగా ఉండమంటారా." అసిస్టెంట్ ఇంజనీరు అడిగాడు.

"అటు నది, ఇటు కొండలు. కాసేపటికి వెన్నెలొస్తుంది. కబుర్లు చెప్పుకోవడానికి వాచ్‌మెన్, డ్రైవర్ ఉన్నారుగా. రేపుదయం మీరు ఏడు గంటలకొస్తే సరిపోతుంది" అన్నాన్నేను. కాసేపయ్యాక స్థానిక అధికారులు, ఇంజనీర్లు వెళ్ళిపోయారు.

స్నానం చేసి రిఫ్రెష్ అయి, లుంగీ, స్పోర్ట్స్ బనీన్ వేసుకున్నాను. కిచెన్ రూమ్‌లోంచి వచ్చి, "సీతాఫలాల జ్యూస్ సార్" అంటూ జ్యూస్ గ్లాస్‌ను నాకందించి, చేతులు కట్టుకుని నిలబడ్డాడు యోహాన్.

మొక్కల్ని పొదుగుకున్న ఎత్తయిన కొండల మధ్య అక్కడక్కడ వెలుగుతున్న దీపాలు మినుకు మినుకుమంటున్నాయి. పక్కకు తిరిగి పడుకున్న ముసుగు వేసుకున్న మొఘల్ రాజకుమారిలా లోయలు. ఆ లోయల దిగువన ఉస్తేపల్లి గ్రామంలోని గుడిసెలన్నీ లక్కబొమ్మల్లా కనిపిస్తున్నాయి.

ప్రకృతిలోని పచ్చదనపు పరిమళాల్ని మోసుకొస్తూ కొండగాలి రివ్వు రివ్వుమని వీస్తోంది.

"డ్రైవర్ రఘునాథ్ ఎక్కడ?" అడిగాను యోహాన్ని.

"ఇద్దరం కలిసి డిన్నర్ ప్రిపేర్ చేస్తున్నాం సార్. ప్రస్తుతం అతను కుందేలు క్రరీ చేసే కార్యక్రమంలో ఉన్నాడు" అని యోహాన్ జవాబు చెప్తున్న సమయంలో–

"అన్నీ వరండాలో ఎరేంజ్ చేసేమంటారా" అంటూ వచ్చాడు రఘునాథ్. గత మూడేళ్ళుగా నాదగ్గర డ్రైవర్‌గా పనిచేస్తుండడం వల్ల రఘునాథ్‌కు ఇలాంటి క్యాంపుల సమయంలో నా అలవాట్లు బాగా తెలుసు.

గెస్ట్‌హౌస్ పరిసర ప్రాంతాలన్నీ నిశ్శబ్దంగా ఉన్నాయి.

ఎప్పుడో బ్రిటిష్ కాలం నాడు కట్టిన గెస్ట్‌హౌస్ విశాలంగా ఉంది. ఆవరణలో అంతెత్తు పెరిగిన అశోక చెట్లు, చింత చెట్లు, పొడవాటి స్తంభాలు, పనిచెయ్యని ఫౌంటెన్.

వరండాలో కుర్చీ, టీపాయ్ ఏర్పాటు చేసి, ఆ టీపాయ్ మీద రెడ్ లేబిల్ స్కాచ్ విస్కీ బాటిల్, సోడాలు, గ్లాసు పెట్టి వెళ్ళిపోయాడు. గ్లాసులో డ్రింక్ పోసుకుని, సోడా కలిపి సిప్ చేశాను.

కాసేపటి తర్వాత మంచింగ్ కోసం, ఫిష్ కట్‌లెట్స్, జీడిపప్పు, వెజిటబుల్ సలాడ్ తెచ్చి ప్లేట్లలో సర్దాడు యోహాన్.

గాలిలో ఊగే చెట్ల కొమ్మల చప్పుడు, ఎక్కడో టూరింగ్ టాకీసులోంచి వచ్చి, గాలిలో తేలుతున్న అస్పష్టపు సినిమా పాట, అమరావతి గుడిలోంచి వినిపిస్తున్న గంటల సవ్వడి. రిజర్వాయర్ కార్మికులు ఇళ్ళకెళ్తూ మాట్లాడుకుంటున్న మాటలు, నీళ్ళలో పడవలు కదుల్తున్నప్పుడు అలల చిరు అలజడి కొంతసేపు వినిపించాక అంతా నిశ్శబ్దం.

యోహాన్ వచ్చి నాకెదురుగా కూర్చున్నాడు. నేనడిగే ప్రశ్నలకు తనకు తెలిసిన జవాబులు చెప్తున్నాడు.


"అప్పుడెప్పుడో ఆ కొండల్లో వజ్రాలు దొరికేవట. అందుకే దాన్ని వజ్రాల కొండ అంటారు. ఇప్పటికీ వర్షాకాలంలో బొంబాయి నుంచి షావుకార్లు వచ్చి, గుడారాలు వేసుకుని రోజుల తరబడి వెతుకుతుంటారు. వజ్రాలు దొరికిన ఆనవాలు లేదు."

వింటూ కింద లోయ పక్కనున్న గ్రామం వేపు చూస్తున్నాను. ఒక చోట గుంపులు గుంపులుగా మనుషులు గుమికూడి ఉన్నారు. ఏవో మాటలు, అరుపులు అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

"ఏవిటక్కడ?" అనక్తిగా అడిగాను.

"అంతా పల్లెకారులు, వ్యవసాయ కూలీలే కదా సార్. రోజూ ఏదో ఒక గొడవ జరగడం మామూలే. ఎవడో ఒకడు తాగి రావడం, పెళ్ళాన్ని తన్నడం, ఆ పెళ్ళాం పక్కన కొంతమంది, ఆ మొగుడు పక్కన కొంతమంది చేరడం, వాళ్ళిద్దరికీ రాజీ కుదర్చబోయి వీళ్ళు తన్నుకోవడం, వీళ్ళని విడిపించడానికి ఇంకొంతమంది రావడం. వీళ్ళకదే పెద్ద కాలక్షేపం సార్." హావభావాల్తో చెప్పాడు యోహాన్.

చిత్రాలు: నర్సిం



సిగరెట్ తీసి వెలిగించి, అటు దిశగా చూస్తున్నాను. కొంతమంది పెట్రొమాక్స్ లైట్లు, మరికొంతమంది హారికెన్ లాంతర్లు పట్టుకెళ్తున్నారు. ఇంకొంతమంది గోడలపైకి, ఇళ్ళపైకి ఎక్కి ఆసక్తిగా చూస్తున్నారు. గెస్ట్‌హౌస్ ప్రహారీ గోడ దాటి, రోడ్డు నగం వరకూ వెళ్ళి అక్కడున్న రావిచెట్టు పక్కన నిలబడి, నిశితంగా జరుగుతున్నదానిని పరిశీలించి వెనక్కొచ్చిన యోహాన్, "అక్కడేదో పూజలాంటిది జరుగుతున్నట్టుగా ఉంది సార్" అన్నాడు.

"పూజా?"

"అవున్సార్. ఇక్కడి ప్రజలకు మూఢనమ్మకాలు కూడా చాలా ఎక్కువ సార్."

"మనది హిందూ నంప్రదాయం అంటూ అణు పరీక్షలకు ముందు కొబ్బరికాయలు కొట్టి, దీపాలు వెలిగించే సైంటిస్టులున్న దేశం మనది. కానీ, ఈ రాత్రి నమయంలో పూజలంటే, అవి మామూలు పూజలేనంటావా? పద చూద్దాం" అని లేచాను నేను చేతి గడియారం చూసుకుంటూ.

రాత్రి తొమ్మిదీ పది నిమిషాలైంది.

కిచెన్లో ఉన్న డ్రైవర్‌తో చెప్పి వచ్చి, "రండి సార్" అంటూ ముందుకు నడిచాడు యోహాన్.

పది నిమిషాల తర్వాత ఆ గ్రామంలో ఉన్నాం.

అక్కడ నాకు కనిపించింది సాధారణ దృశ్యం కాదు. అసాధారణ దృశ్యం.

నలువేపులా భారీ చింతచెట్ల నడుమ ఒక గుడిసె. ఆ గుడిసెకు కొంచెం దూరంలో పెద్ద కంచె మధ్య మేకల మంద. ఆ పక్కన పెంటకుప్ప. పెంటకుప్పకు, గుడిసెకు మధ్య విశాలమైన ఖాళీ ప్రదేశం.

ఆ ఖాళీ ప్రదేశం మధ్యభాగంలో ఎత్తయిన సిమెంట్ చప్టా మీద మౌనముద్రలో ఒక ఆడమనిషి కూర్చుని ఉంది. ఆ ఆడమనిషికి ముప్పై అయిదేళ్ళ వయసుంటుంది. కుంకుమ రంగు చీర, జాకెట్టు వేసుకుంది. నుదుట మీద రూపాయి బిళ్ళ సైజులో బొట్టు. మెడలో నిమ్మకాయల దండ. ఎడమ చేతిలో మానవ కపాలం. కుడి చేతిలో ఒక ఎముక.

గుడిసె ముందున్న వీధిలైటు కాంతి అస్పష్టంగా ఉండడంతో నలువేపులా పెట్రొమాక్స్ లైట్లను ఏర్పాటు చేశారు. ఆ వెలుగులో పసుపు రాసుకున్న ఆమె ముఖం మరింత తేజస్సుతో కనిపిస్తోంది. ఆమె రెండు మోచేతుల నిండుగా ఎర్రటి గాజులు మిలమిలా మెరుస్తున్నాయి.

ఆమెకెదురుగా కింద నేలమీద ఇద్దరు వృద్ధ దంపతులు కూర్చొని ఉన్నారు. మగ మనిషికి అరవై ఏళ్ళకు పైగా వయసుంటుంది. ఆడ మనిషికి యాభై ఏళ్ళు దాటి ఉంటాయి. ఇద్దరి ముఖాల్లో దుఃఖం, దైన్యం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

"ఇప్పుడు చెప్పండి. జనం ముందు ఏం జరిగిందో మరోసారి చెప్పండి." మౌనముద్రలో కూర్చున్న ఆ ఆడమనిషి కళ్ళు మూసుకునే అడిగింది.

కింద కూర్చున్న ఆడమనిషి చేతులు జోడిస్తూ, "అమ్మా! తల్లీ, కళకళ్ళాడుతూ తిరిగిన ఇరవై ఏళ్ళ పిల్ల. నరిగ్గా ఇరవై రోజుల క్రితం నురగలు కక్కుకుంటూ నేల మీద పడిపోయింది. వెంటనే నందిగామ ఆస్పత్రికి తీసికెళ్ళి ఇంజీషనూ, మందులూ ఇప్పించాం. నయం కాలేదు. భూత వైద్యుడికి చూపించాం. నయం కాలేదు. ఏం మాయదారి దెయ్యం పట్టిందో తెలీదు తల్లీ. మంచం పట్టేసింది. మాట పడిపోయింది. మనిషి కట్టెలా అయిపోయింది. ఇయ్యాల్టికి సరిగ్గా అయిదురోజుల క్రితం ప్రాణాలొదిలేసింది. దాన్ది మామూలు సావుకాదు తల్లీ. ఎవరో ఏదో చేసి చంపేశారని భూత వైద్యుడు చెప్పాడు. ఎవరు చేశారో, ఏం చేశారో నువ్వే చెప్పాల తల్లీ. నా కూతుర్ని చంపినవాళ్ళని నువ్వే చంపాల తల్లీ." ఏడుస్తూ, రాగాలు తీస్తూ తన భాషలో తాను చెప్పింది ఆ చనిపోయిన పిల్ల తల్లి.

చుట్టూ క్రిక్కిరిసిపోయిన జనం. రకరకాలుగా గుసగుసలాడుకుంటున్న జనం.

"నిశ్శబ్దం. నిశ్శబ్దం..." ఎవరో అరుస్తున్నారు.

"తెల్సిపోతుంది. అంతా తెల్సిపోతుంది. ఇప్పుడే తెల్సిపోతుంది. అమ్మ నాతో పలికిస్తాంది" అంటూ ఆ కాషాయాంబరధారి ఆకాశం వేపొకసారి చూసి, అయిదు నిమిషాలసేపు కొన్ని మంత్రాలు పఠించింది.

అదే సమయంలో ఒక ఆడమనిషి వచ్చి, ఆమె ముందు ఒక మట్టిపాత్రను ఉంచింది.

"అమ్మా! తల్లీ, నువ్వడిగిన కోడి రక్తం తెచ్చాను తల్లీ, తెచ్చాను. దాహం తీర్చుకో" అందావిడ. ఆవిడకు యాభై ఏళ్ళు దాటి ఉంటాయి. కాషాయ వస్త్రాలు కట్టుకుంది.

"చూశాను. చూస్తున్నాను. నా దాహం తీర్చుకుంటాను" అని కుంకుమాంబరధారి ఆ మట్టి పాత్రను రెండు చేతుల్తో ఎత్తి పట్టుకుని తాగి, కొంత పుక్కిట పట్టి, లేచి నిలబడింది.

ఆమె లేవడంతో ఆమె నమీపంలో చుట్టూ ఉన్న ఆడ, మగ జనం భక్తిప్రపత్తులతో గౌరవంగా లేచి నిలబడ్డారు.

ఎడమ చేతిలోని కపాలమ్మీద కుడి చేతిలోని ఎముకతో కొడుతూ, "తల్లి కదిలిందిరా బిడ్డా. తల్లికి అడ్డు చెప్పకురా బిడ్డా" అంటూ ముందుకు నడిచిందామె.


ఇద్దరు వ్యక్తులు ఆమె ముందు పెట్రొమాక్స్ లైట్స్‌తో నడుస్తున్నారు. కళ్ళు మూసుకునే ఆ ఆడమనిషి పది అడుగులు ముందుకు నడిచి ఒక చోట ఆగి, ఎముకతో కపాలమ్మీద మూడుసార్లు కొట్టి, నోటి పుక్కిలిలో ఉన్న రక్తాన్ని ఊసింది. ఆ రక్తం ఒక మట్టి గుట్ట మీద పడింది.

అప్పుడామె కళ్ళిప్పి చూసి, రక్తం పడిన చోట కపాలాన్ని పెట్టి, "ఇక్కడే, ఇక్కడే తవ్వండిరా. కాళిక తల్లిని తలచుకుని ఇక్కడ తవ్వండిరా. బలిని మూడడుగుల లోతులో పాతిపెట్టారు. తియ్యండి, తియ్యండి" అంటూ బిగ్గరాగా అరిచి చెప్పింది.

నా పక్కనే నిల్చుని చూస్తున్న పల్లెటూరి వ్యక్తి వేపు చూసి, "ఏంటయ్యా ఇది. ఎవరావిడ? ఏం చేస్తోంది" అని అడిగాను. ఆ వ్యక్తి నా వేపు ఎగాదిగా చూసి, "రాఘవాపురం పరదేశమ్మ. సత్య మైన కాళికాభక్తురాలు. ఆమె పక్కన పెట్రొమాక్స్ లైట్ పట్టుకున్న వ్యక్తి పరదేశమ్మ భర్త. ఆ కాషాయపు చీర కట్టుకున్నావిడ వాళ్ళమ్మ" అని చెప్పాడు.

"ఆ రక్తం పడిన చోట ఇప్పుడేం జరుగుతుంది" అని అడిగాను.

"అక్కడ బలి బయట పడుతుందట."



కింద లోయ పక్కనున్న గ్రామం వేపు చూస్తున్నాను. ఒక చోట గుంపులు గుంపులుగా మనుషులు గుమికూడి ఉన్నారు. ఏవో మాటలు, అరుపులు అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

"బలి అంటే?"

"చూడండి. తీస్తారు" అని ముఖం తిప్పేసుకున్నాడతను.

ఊరంతా నిండిన దట్టమైన చీకట్లను చీల్చుకుంటూ అక్కడ మాత్రమే నిండిన వెలుగుల్లో ఆ ప్రాంతమంతా వీధి నాటకంలో సెట్టింగ్‌లా ఉంది.

ముగ్గురు బలిష్ఠులైన మగవాళ్ళు గునపాలు తీసుకుని ఆ పరదేశమ్మ రక్తం పుక్కిలించిన ప్రదేశంలో తవ్వుతున్నారు. కొంతమంది ఆడవాళ్ళు ఆ తవ్విన మట్టిని చేతుల్తో తీసి పక్కన పోస్తున్నారు. అరగంట గడిచింది. ఆ ప్రదేశంలో ఏం బయటపడుతుందోనని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. నాకా దృశ్యం చాలా ఆశ్చర్యంగానూ, విచిత్రంగానూ ఉంది.

"ఇక్కడ తవ్వండిరా బాబూ, ఇక్కడ" అంటూ చేతిలోని ఎముకతో నేల మీద చూపిస్తూ చెప్తోంది పరదేశమ్మ. అంతవరకూ ఆ సంఘటనను చూస్తున్న జనం ఇప్పుడు రెట్టింపయ్యారు. ఊరు ఊరంతా దాదాపు ఇప్పుడక్కడే ఉంది.

"అదిగో అమ్మ చెప్తోంది, చెప్తోంది. ఇక్కడే, ఇక్కడే" అంటూ ఒకసారి కళ్ళు మూసుకుని ఆకాశం వేపు అదృశ్యవాణి చెప్తున్న మాటల్ని వింటున్నట్టుగా విని, "ఇక్కడే ఇంకా లోతుగా తవ్వండిరా" అంటూ తవ్వుతున్నవాళ్ళని ఉత్సాహపరుస్తూ అందావిడ.

ఆ సమయంలోనే ఒక గునపానికి ఏదో వస్తువు తగిలి, ఖణేల్‌మని శబ్దం వినిపించింది. ఆ ఖణేల్‌మన్న వస్తువును చూడడం కోసం అందరూ ముందుకు ఒక్కుమ్మడిగా కదిలారు.

ఎవరో ఒక వ్యక్తి ఆ జనాన్ని, పరదేశమ్మను ఫోటో తియ్యబోతే, ఆమె భర్త వద్దంటూ వారించి, అతన్ని అక్కడ నుంచి తీసుకెళ్ళిపోయాడు. ఫోటో ఎందుకు తియ్యకూడదని ఆ వ్యక్తి పరదేశమ్మ భర్తతో ఘర్షణ పడుతున్నాడు.

"తవ్వండిరా బాబూ తవ్వండిరా." పరదేశమ్మ బిగ్గరగా చెప్తోంది.

సరిగ్గా అదే సమయంలో ఆ మట్టిపెళ్ళల మధ్యలో ఒక తెల్లటి గుడ్డమూట బయటపడడంతో, "తల్లీ, పరదేశమ్మ తల్లీ, నీ సత్యం బయటపడింది తల్లీ" అంటూ అక్కడున్నవాళ్ళందరూ భక్తితో అరిచారు. మిగతా ప్రజల్లో హాహాకారాలు చెలరేగాయి.

"చూశారా, పరదేశమ్మ తల్లి చెప్పింది సత్యమైంది. సత్యం గొప్పదిరా నాయనలారా. సత్యం గొప్పది." ఆ గుడ్డమూట చుట్టూ ఎముకతో మూడు గీతలు గీసి, నెమ్మదిగా ఆ మూటను విప్పింది పరదేశమ్మ.


అందరూ గుడ్లప్పగించి బొమ్మల్లా చూస్తున్నారు.

చెట్లను ఢీకొని, ఆకుల్ని రెపరెపలాడిస్తూ వీస్తున్న కృష్ణానది గాలుల శబ్దం మట్టి గాజుల శబ్దంలా మృదువుగా ఉంది. తలెత్తి ఆకాశం వేపు చూశాను. సన్నటి వెన్నెల మంచు ముద్దలతో కలిసి కిందకు రాలుతున్నట్లుగా ఉంది.

పరదేశమ్మ మొదట ఆ మూట లోంచి గుప్పెడు వెంట్రుకల్ని బయటకు తీసి అందరకూ చూపించింది. తర్వాత రెండు విరిగిన గాజులు, ఒక రాగి నాణెం, కొన్ని గాజుముక్కలు. రెండు కమిలిపోయిన నిమ్మకాయలు, చివరగా చూపుడు వేలంత పసుపు, కుంకుమ పూసిన గుడ్డబొమ్మ తీసింది.

"ఇదిగో భక్తులారా. చూడండి, బాగా చూడండి. చూశారుగా ఈ వస్తువుల్ని. బలి పెట్టడం అంటే ఇదే. ఇక్కడ ఈ వస్తువుల్ని పెట్టి మూడు మాసాలైంది. గత మూడు మాసాల క్రితం ఈ బలిని ఇక్కడ పెట్టారు. అంచెలంచెలుగా ఆ అమ్మాయి కృంగి, కృశించి ఆఖరికి చనిపోవడానికి కారణం ఇదే" అంటూ తన పక్కనే ఉన్న వృద్ధ దంపతుల వేపు చూసిందామె.

ఆ వృద్ధ దంపతులిద్దరూ ఒక్కసారిగా ఏడ్వడం ప్రారంభించారు. బలి వస్తువుల్ని చూడడానికి పల్లెజనం ఒక్కసారిగా ముందుకు తోసుకుని



వెళ్తున్నారు.

"తల్లీ, ఏ కిట్టనివాడు ఆ బలిని పెట్టి, మా పిల్లను చంపాడో చెప్పు తల్లీ." ఆ వృద్ధ దంపతులిద్దరూ ఆ పరదేశమ్మ కాళ్ళమీద పడ్డారు.

"నేనొచ్చింది అందుకే కదరా. ఈ పరదేశమ్మ నేరస్తుల్ని వదలదురా. ఇప్పుడే, ఇప్పుడే ఆ నేరస్తుడెవరో తెల్సిపోతుంది. రండిరా, రండి. నా వెనక రండి" అంటూ బలి వస్తువుల్ని మూటలో కట్టేసి చేత్తో పట్టుకుని నిలబడి నలువేపులా చూస్తోంది.

ఆమెకెదురుగా ఉన్న జనం రెండుగా చీలిపోయారు.

పెట్రొమాక్స్ లైట్ల వెలుతురులో పరదేశమ్మ ముఖం కాళికాదేవి ముఖంలాగ భయంకరంగా ఉంది.

కళ్ళు మూసుకుని బయటకు వినపడకుండా ఏవో మంత్రాలను జపిస్తూ ముందుకు నడుస్తోంది పరదేశమ్మ.

ఆమెను జనం అనుసరించారు. అంతమంది మనుషులు అక్కడ గుమిగూడడం చూసిన కుక్కలు ఉండుండి అరుస్తున్నాయి. రెండు ఫర్లాంగుల దూరం వరకూ పరదేశమ్మ నడిచి, అక్కడ ఆగి కళ్ళిప్పి నలువేపులా చూసింది.

"ఇక్కడే నేను నుంచుంటాను. మీరు దక్షిణం దిశగా వెళ్ళండి. అక్కడ బావికి ఆనుకుని ఒక గుడిసె ఉంటుంది. ఉందా" అని అడిగిందామె.

"ఉంది తల్లీ."

"ఆ గుడిసెలోకి వెళ్ళండి. ఇక్కడ నేను చేసిన పూజల వల్ల అక్కడ నేరస్థుడు మత్తులో పడి మట్టిలో కొట్టుకుంటున్నాడు. ఆణ్ణి తీసుకురండి. ఆడే మీ పిల్లను బలిపెట్టి చంపాడు." వీరావేశంతో చెప్పింది పరదేశమ్మ.

కొంతమంది ఆడా మగా ఆమె చెప్పిన దక్షిణం దిశగా పెట్రొమాక్స్ లైట్లు చేత పట్టుకుని పరుగు పరుగున వెళ్ళారు. బావి పక్కనున్న గుడిసె ఎవరిదో తెలిసిన ఊరి జనం గుసగుసలాడుకుంటున్నారు.

"ఎవరిదా గుడిసె. నిజంగా నేరస్థుడక్కడ దొరుకుతాడా." యోహాన్‌ని అడిగాను.

"ఆ గుడిసె వీరయ్యగాడిది సార్. ఆడి కొడుకు పట్నంలో రోజు కూలీగా పని చేస్తున్నాడు. అరవై ఏళ్ళ వీరయ్యగాడు బలిపెట్టడం ఏంటో." అయోమయంగా అన్నాడు యోహాన్.

పది నిమిషాల తర్వాత అరవై ఏళ్ళ వీరయ్యని ఇద్దరు మగాళ్ళు బందిపోటును పట్టుకొచ్చినట్టుగా తీసుకొచ్చారు. వీరయ్య సన్నగా, పొడవుగా ఉన్నాడు. చింపిరి జుత్తు. గొంగళి కప్పుకున్నాడు. కల్లు తాగిన మత్తులో మగతగా ఉన్నాడు.

చనిపోయిన అమ్మాయి తల్లితండ్రులు, బంధువులు వీరయ్యను, వాడితోపాటు వాడి కొడుకునీ శాపనార్థాలు పెడుతూ తిడుతున్నారు.

"నాకేం తెలీదు, నాకేం తెలీదు." వీరయ్య కాళ్ళా వేళ్ళా పడుతున్నాడు.

"ఆణ్ణి చెట్టుకేసి కొట్టండి నిజం తెలుస్తుంది." ఎవరో గట్టిగా అరవడంతో కొంతమంది వాణ్ణి చింతచెట్టు దగ్గరికి తీసుకొచ్చి కట్టేసి చావబాదారు.

"నాకు గానీ, నా కొడుక్కి గానీ చిల్లంగి విద్యలూ, బలిపెట్టడాలూ తెలీవు తల్లీ. అయ్యల్లారా, బాబుల్లారా నన్ను నమ్మండి. రక్షించండి." వాడి

ఏడుపును అందరూ నాటకంగా కొట్టిపారేస్తున్నారు.

చేతిగడియారం వేపు చూశాను. రాత్రి పదకొండు గంటలు దాటింది.

"ఈరోజు రాత్రంతా వీణ్ణిలా చెట్టుకి కట్టేసి ఉంచండి. రేపుదయం వాడిమట్టుకు వాడే నిజం ఒప్పేసుకుంటాడు. చూడండి, అందరూ వెళ్ళండి, ఇళ్ళకు వెళ్ళిపోండి." పరదేశమ్మ భర్త అరుస్తూ చెప్పాడు.

పల్లెజనం రకరకాల కామెంట్స్. తర్వాత ఏం జరుగుతుందోనన్న ఆసక్తి. పావుగంట తర్వాత చింత చెట్టు పక్కనున్న గుడిసెలోకెళిపోయింది పరదేశమ్మ.

గుంపులు గుంపులుగా జనం అక్కడ నుంచి కదిలారు. యోహాన్‌తోపాటు నేనూ కదిలాను. గెస్టుహౌస్ వరండా మీదకొచ్చి కుర్చీలో కూలబడి, డ్రింక్ గ్లాసుని అందుకున్నాను. యోహాన్‌కి, రఘునాథ్‌కి రెండు పెగ్గులు పోశాను.

"పరదేశమ్మ ఆ బలినీ బలే కనిపెట్టింది సార్" అన్నాడు యోహాన్, ఒక్క గుటకలో గ్లాసుని ఖాళీచేసి.

నాకూ ఆ సంఘటన చాలా విచిత్రంగా ఉంది. కోడి రక్తాన్ని పుక్కిలించి ఊయడం, ఆ ప్రదేశంలోనే బలిపెట్టిన గుడ్డమూట దొరకడం, దాని ఆధారంగా వీరయ్య అనే వ్యక్తిని నిందితుడిగా లాక్కుని రావడం... అంతా అనూహ్యంగా ఉంది. వీరయ్య అనే వ్యక్తి ఆ అమ్మాయికి చేతబడి చేసి చంపేడనడానికి సాక్ష్యం పరదేశమ్మ మాటలేనా? ఆ పరదేశమ్మ వీరయ్య ఇంటినే ప్రత్యేకంగా చూపించడం ఏమిటి?

నాలో కలిగిన సందేహాలకు సమాధానాలు లేవు.

"ఆ పరదేశమ్మ మామూలు మనిషి కాదు సార్. ఆ కాళికాదేవి అవతారం. ఈ ప్రాంతంలో ఇలాంటి కేసులన్నీ ఆవిడే పరిష్కరిస్తుంది సార్. అప్పుడప్పుడు పోలీసులు కూడా కొన్ని కేసుల్లో పరిష్కారం కోసం ఆవిడ దగ్గరకు వెళ్తుంటారు సార్. ఆవిడ గురించి నేను చాలాసార్లు విన్నాను. ఇవాళే మొదటిసారి ఆవిణ్ణి చూశాను." భక్తిప్రపత్తులు ధ్వనించిన గొంతుతో అన్నాడు యోహాన్.

"ఆ పరదేశమ్మది కూడా ఈ ఊరేనా?" అడిగాను.

"కాదు సార్. ఇక్కడకు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రాఘవా లక్ష్మీపురం. అక్కడ ఆశ్రమం కూడా ఉంది. గాలి, ధూళి, దెయ్యం, పూనకం, చిడుపు, చిల్లంగి- ఎలాంటి కేసులైనా పరిష్కరిస్తుంది. ఆశ్రమానికి వెళ్తే రెండువేల రూపాయలు, బయటి కొస్తే అయిదు వేల రూపాయలివ్వాలి. రానూ పోనూ కారు ఏర్పాటు చేయాలి."

"ఆ చనిపోయిన అమ్మాయి తల్లితండ్రులు చాలా పేదవాళ్ళలా ఉన్నారు. అయిదు వేలు ఇచ్చుంటారా" అని అడిగాను.

"నేరస్థుణ్ణి పట్టేసింది కదా సార్. ఈపాటికి డబ్బు తీసుకునే ఉంటుంది. అక్కడున్న అంబాసిడర్ కారు చూశారా. ఇవాళ రాత్రి ఆ గుడిసెలో ఉండి, ఉదయాన్నే ఆ వీరయ్యగాడు నేరం ఒప్పుకున్నాక వెళిపోతుందనుకుంటాను." చెప్పాడు యోహాన్.

చట్టం, న్యాయం పరిధిలోకి రాకుండా ఇలాంటి ఎన్నో కేసులు పల్లెటూళ్ళలో పరిష్కారమవుతున్నాయి. బలహీనుల రాజ్యంలో ఎప్పుడూ బలవంతులదే పైచేయి. కానీ, మానసిక బలహీనుల సమాజంలో అంధ విశ్వాసానిదే పైచేయి అవుతోంది.

కానీ, ఇక్కడ వీరయ్య నిజంగా నిందితుడేనా అనేది నా సందేహం. అన్యమనస్కంగానే సిప్ చేస్తూ, నిద్రపోతున్న ఆ పల్లెవేపు చూస్తూ ఆలోచిస్తున్నాను.

గత నలభై ఏళ్ళ ప్రభుత్వ సర్వీసులో కొన్ని వందల సంఘటనల్నీ, సందర్భాల్నీ నేను చూసినా, ఇలాంటి సంఘటనను నేనెప్పుడూ చూడలేదు.

రాత్రి ఒంటి గంట దాటింది.

డైనింగ్ టేబుల్ వేపు నడిచాను. ఇరవై నిమిషాల్లో డిన్నర్ పూర్తయింది. నాకు గుడ్‌నైట్ చెప్పి యోహాన్, రఘునాథ్ పక్కగదిలోకెళ్ళిపోయారు.

నది నీళ్ళను కప్పుకుని నిద్రపోతోంది. అమరావతి దేవాలయం పవిత్రతను కప్పుకుని నిద్రపోతోంది. లోయలోని గ్రామం అమాయకత్వాన్ని కప్పుకుని నిద్రపోతోంది. మంచును కప్పుకుని చీకటి నిద్రపోతోంది. నాకు మాత్రం నిద్ర పట్టడం లేదు.

రాత్రి మూడు గంటలు దాటింది. బెడ్‌మీద దొర్లుతూ, నిద్ర రాక లేచి సిగరెట్ వెలిగించుకొని రూమ్‌లోంచి బయటికొచ్చి, గెస్టుహౌస్ గోడ దగ్గరకొచ్చి నుంచున్నాను.

మసక వెన్నెల్లో ఆ గుడిసెల ముందు చెట్టుకు కట్టేసిన వీరయ్య దిష్టి బొమ్మలా కనిపిస్తున్నాడు.

'కట్లు విప్పేసి వాణ్ణి పంపించేస్తే' ఆలోచన రాగానే మరేమాత్రం సంకోచించకుండా ముందుకు నడిచాను.

గెస్టు హౌస్ రోడ్డుకి అటూ, ఇటూ ఉన్న విద్యుద్దీపాల మసక కాంతిలో నా నీడ నాకు వికృతంగా కనిపిస్తోంది.

గబగబా నడుస్తున్న నేను ఒక్కసారి రావిచెట్టు పక్కన ఆగిపోయాను.

దూరంగా చింతచెట్టు పక్కనున్న గుడిసెలోంచి ఇద్దరు వ్యక్తులు బయటికొచ్చి అటూ ఇటూ చూసి, వీరయ్యకేసి నడిచారు.

ఆ ఇద్దరు వ్యక్తుల్లో ఒక వ్యక్తి గబగబా చెట్టు దగ్గరకెళ్ళి వీరయ్యను విడిపించి, పది గజాల దూరంలో చీకట్లోకి నడిపించుకొని వెళ్ళాడు.

రెండో వ్యక్తి చెట్ల చాటు నుంచి వాళ్ళ దగ్గరకు వెళ్ళడం గమనించిన నేను, జోరుగా అడుగులేస్తూ వాళ్ళకు రెండు గజాల దూరంలో బండ చాటుగా చీకట్లో నుంచున్నాను. అప్పుడు నేను వాళ్ళిద్దర్నీ గుర్తు పట్టాను. ఒకరు పరదేశమ్మ, రెండోవ్యక్తి ఆమె భర్త.

"ఒప్పందంలో నన్ను సెట్టుకు కట్టడమే ఉంది. కొట్టడం లేదు. నన్నెంతగా కొట్టారో చూడండి. నేను పడ్డ కష్టానికి ఇంకో అయిదు వందలియ్యండి" అన్నాడు వీరయ్య.

వీరయ్య గొంగళిని సర్దుకుంటూ, "ఎంతలేసి దెబ్బలు కొట్టారో నా కొడుకులు." తిట్లు లంకించుకున్నాడు.

"వీరయ్యా, తర్వాత తిట్టుకుందువుగానీ బాగా నటించావు. చూడూ, నీకిస్తామన్న వెయ్యి రూపాయలు ఇదిగో తీసుకో. అర్జంటుగా నువ్వు గుంటూరు వెళ్ళిపో. నువ్వు నది దాటడానికి పడవ సిద్ధంగా ఉంది" అని పది వంద రూపాయల నోట్లను వీరయ్య చేతిలో పెట్టాడు పరదేశమ్మ భర్త.

"వెయ్యి రూపాయలేనా" అన్నాడు వీరయ్య.

"ఏం, ఎంత ఇమ్మంటావ్. ఒప్పందం ఇదే కదా" అంది పరదేశమ్మ.

"మీరు చెప్పినట్లుగా మీరిచ్చిన ఆ గుడ్డ మూటను ఆళ్ళింటి ముందు పెట్టడానికి ఎంత కష్టపడ్డానో తెలుసా. ఒప్పందంలో నన్ను సెట్టుకు కట్టడమే ఉంది. కొట్టడం లేదు. నన్నెంతగా కొట్టారో చూడండి. అసలే చలి, మంచు. బీడీ ముక్కయినా చాటుగా ఇచ్చారు కాదు. నేను పడ్డ కష్టానికి ఇంకో అయిదు వందలియ్యండి" అన్నాడు వీరయ్య.

"ఒకప్పుడు భూతవైద్యాలవీ చేసేవోడివని నిన్ను మాలో కలుపుకుంటే, కేసు కేసుకీ రేటు పెంచేస్తే మేమెలా బతుకుతాం చెప్పు. ఇదిగో ఈ మూడు వందలుంచు. ఎవరి కంటా పడకండా వెళ్ళిపో." చెప్పింది పరదేశమ్మ. ఆమె భర్త మూడు వందలు తీసి వీరయ్యకిచ్చాడు.

"ఇలాంటి పెద్ద కేసులుంటే కబురు పెట్టమ్మా. చిటికెలో వాలిపోతాను. వస్తానమ్మా" అంటూ వాళ్ళిద్దరికీ నమస్కారం చేసి వీరయ్య చీకట్లోకి అడుగువేసి నదివేపు వెళ్ళిపోయాడు. కళ్ళారా ఆ దృశ్యాన్ని చూసిన నేను అవాక్కయిపోయాను.

నిప్పుల సెగడి మధ్య నుంచున్నట్టుగా ఉంది.

ఎంత మాయ! పల్లె ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని దేవత సాక్షిగా ఆడిన నాటకం.

ఒక్కసారిగా బండరాయి చాటునుంచి వెలుతురులో కొచ్చాను. నన్ను చూసి వాళ్ళిద్దరూ నిర్ఘాంతపోయారు.

"అంతా చూశాను. ఇంత మాయ చెయ్యడం తప్పు కదూ" అన్నాను.

పరదేశమ్మ భర్త గెస్టు హౌస్ వేపు, నావేపు ఒకసారి చూసి, "మీరేనా గెస్టు హౌస్‌లో దిగిన ఆఫీసరు" అని, "ఏం తప్పు సార్. మా బతుకుతెరువు ఇది. ప్రపంచంలో ఇప్పటివరకూ మాయ గురించి తెలీనట్టు, మాయను చూడనట్టు మాట్లాడుతున్నారేటిసార్." ఆ మాటల్లో వ్యంగ్యం ఉంది.

"ఒక్కటి కూడా నిజం లేకండా మరీ ఇంత దోపిడీయా."

"నిజం ఎందుకు లేదు బాబూ. ఆ పిల్ల ఏదో రోగంతో చచ్చిపోయిందన్నది నిజం. ఎవరో కిట్టని వాళ్ళు చిల్లంగి పెట్టి చంపించారని వాళ్ళ వాళ్ళే వచ్చి చెప్పారు. మిగతాదంతా మా వృత్తిలో ఒక భాగం. ఏ వృత్తిలోనైనా మాయలూ, మర్మాలూ ఉంటాయి కదా సార్" అంది పరదేశమ్మ.

"మరి దేవుడు, దేవతల పేర్లు చెప్పి మనుషుల బలహీనతల్ని ఆసరా చేసుకుని మోసం చెయ్యడం." సిగరెట్ వెలిగిస్తూ కోపంగా అడిగాను.

"నిద్ర మానుకుని, మమ్మల్ని పూర్తిగా గమనించి, సీరియస్‌గా అడుగుతున్నావు కాబట్టి చెప్తున్నాను. నిజమే, అన్యాయమే, మోసమే, మాయే. కాదనను. కానీ బాబూ నేనో ప్రశ్న వేస్తాను. ఏమనుకోకండా జవాబు చెప్తావా." నా కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగింది పరదేశమ్మ.

"అడుగు" అన్నాన్నేను.

"చిలక జోస్యాలు, చేతి జాతకాలు, నాడీ జోస్యాలు, వాస్తు పేరిట లక్షల్లక్షల దోపిడీ. ఆళ్ళు మనుషుల బలహీనతలతో ఆడుకోవడం లేదా బాబూ. మహా పండితుల్లా చలామణీ అయిపోవడం లేదా బాబూ. ఎందుకురా నువ్విలా పబ్లిగ్గా మోసం చేస్తున్నావ్" అని ఏ చట్టం గానీ, న్యాయం గానీ వాళ్ళనెందుకు ప్రశ్నించడం లేదు, ఎందుకు శిక్షించడం లేదు. వాళ్ళ దగ్గర పోల్చుకుంటే మాది నీటిబొట్టంత మాయ. మనిషి మాయలోంచే పుట్టాడు బాబూ. మాయ చేస్తూ, మాయలోనే బతుకుతున్నాడు" అంటూ నాకు నమస్కారం పెట్టి ముందుకు కదిలింది పరదేశమ్మ. ఆమెను అనుసరించాడు భర్త.

ఆలోచనరహితంగా వెనక్కి తిరిగాను.

వాళ్ళ మాటల్లో న్యాయం ఉందనిపించింది. కానీ, నా మనసులో ఎక్కడో ఏదో బాధ.

గెస్టు హౌస్ వరండాలోకొచ్చి మెట్ల మీద కూర్చున్నాను.

దూరంగా నది నీళ్ళమీద తేలుతూ పడవ వెళ్ళిపోతోంది. ఆ పడవలో మసకలా వీరయ్య.

గ్రామంలో చింతచెట్టు గట్టుమీదున్న హరికెన్ లాంతరులోని దీపకళిక మినుకుమినుకుమంటోంది.

చల్లటి కొండగాలి నా చుట్టూ తిరుగుతోంది.

నదిలోని నీరు నామీంచే పారుతున్నట్టుగా ఉంది.

నేను అన్నిటినీ ప్రేక్షకుడిలా చూస్తున్నాను. ■